### కోస్తా తీర ప్రాంతంలో ఉమ్మడి అధ్యయనానికి

# ఎయు, ఇన్‌కాయిస్ ఒప్పందం

పెదవాల్తేర్, మార్చి 26(ఆన్‌లైన్): కోస్తా సాగర తీర ప్రాంతంపై ఉమ్మడిగా అధ్యయనం, ప్రత్యేక పరిశోధనలు చేసేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం, భారత ప్రభుత్వ భూగర్భ శాఖకు చెందిన ఇన్‌కాయిస్ సంస్థల ఒప్పందం కుదిరింది. సోమవారం ఎయులో జరిగిన విలేకరుల సమావేశంలో ఎయు విసి ఆచార్య ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, మహా విశాఖ మేయర్ పులుసు జనార్ధనరావుల సమక్షంలో ఇన్‌కాయిస్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ శైలేష్ నాయక్, రిజిస్ట్రార్ ఆచార్య పి.విజయప్రకాష్‌లు అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఎయు విసి ఆచార్య ఎల్.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎయుకు చెందిన బంగాళాఖాత అధ్యయన కేంద్రం తీరప్రాంత సముద్రంలో శాటిలైట్ అన్వేషణపై విశిష్ట సమాచారాన్ని సేకరించిందన్నారు. అలాగే ఆకాశం నుంచి ఛాయా చిత్రాల ద్వారా వివిధ రకాల సమాచారాన్ని సేకరించిందన్నారు. డెల్టా స్టడీస్ సెంటర్, సాగర శాస్త్ర సాంకేతిక కేంద్రం, వాతావరణ, సముద్ర విభాగం, సాగర వనరుల శాఖ, జంతు, వృక్ష, రసాయన, మానవ జన్యు శాస్త్రాలు వ్యవసాయ ఆర్థిక కేంద్రం, భూగర్భ, భూభౌతిక పర్యావరణ శాస్త్ర విభాగాల ద్వారా ఎయు చేపలు, రొయ్యల పెంపకంపైనా, వాటికి వచ్చే వ్యాధుల నివారణపైనా పలు పరిష్కార మార్గాలను సూచిస్తూ శిక్షణ ఇస్తున్నదన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి వనరుల అన్వేషణలో ఎయు, ఇన్‌కాయిస్ సంస్థల సంయుక్త పరిశోధనలు ఎంతో ఉపయోగపడగలవని ఆకాంక్షించారు.



ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న ఎయు రిజిస్ట్రార్ విజయ్‌ప్రకాష్, ఇన్‌కాయిస్ డైరెక్టర్ శైలేష్ నాయక్. విసి వేణుగోపాల్‌రెడ్డి, మేయర్ జనార్ధనరావు, తదితరులు చిత్రంలో ఉన్నారు.

జివిఎంసి మేయర్ పులుసు జనార్ధనరావు మాట్లాడుతూ ఈ రెండు సంస్థల మధ్య కుదరిన ఒప్పందంతో విశాఖ నుంచి మచిలీపట్నం వరకూ గల తూర్పు కోస్తా తీర ప్రాంతంలోని మత్స్యకారుల జీవన స్థితిగతులు మెరుగుపడేందుకు వీలుంటుందన్నారు. ఇన్‌కాయిస్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ శైలేష్‌నాయక్ మాట్లాడుతూ తూర్పు కోస్తా తీర ప్రాంతంలో 2.4 లక్షల మత్స్యకారులు సాంప్రదాయ, యాంత్రిక పద్ధతుల్లో చేపల వేట కొనసాగిస్తున్నారని, ఈ ప్రాంతం మత్స్య వనరుల వైవిధ్యంలో అగ్రగామిగా ఉందన్నారు. ఇన్‌కాయిస్ సంస్థ తీర ప్రాంత వనరుల గురించి, సునామీ, తుఫాను వంటి ప్రకృతి వైపరీత్యాలపై పలు పరిశోధనల్ని నిర్వహిస్తున్నదన్నారు. దీనిలో భాగంగా తూర్పు కోస్తా తీరంలో ఎయుతో కలిసి పలు పరిశోధనలు నిర్వహించనున్నామన్నారు. సముద్రం లోతు, చేపల ఉనికి వంటి ఎంతో విలువైన సమాచారాన్ని మత్స్యకారులకు అందిస్తే, వారు ఎక్కువ చేపలను వేటాడేందుకు వీలు పడుతుందన్నారు. సముద్ర ఉపరితలంలోని క్లోరోఫిల్, ఉష్ణోగ్రత, లవణ సాంద్రత వంటి విషయాలపై మత్స్యకారులకు సమాచారం ఇవ్వనున్నామన్నారు. అనంతరం మహావిశాఖ నగర మేయర్ జనార్ధనరావును విసి వేణుగోపాలరెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో ఎయు సైన్స్, ఆర్ట్స్, లా కళాశాల ప్రిన్సిపాల్స్ ఆచార్య పి.వీర్రాజు, ఆచార్య జె.వి.ప్రభాకరరావు, ఆచార్య వై.సత్యనారాయణ, ఇసి సభ్యులు ఐ.మురళీకృష్ణారావులతో పాటు పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.